
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి గుండుబోగుల వెంకటేశ్వరరావు, రామలక్ష్మి దంపతులు శనివారం రూ.20 వేల విరాళం ఇచ్చారు.



కాలువలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4900, మధ్య డెల్టాకు 2500, పశ్చిమ డెల్టాకు 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

రేపు జిల్లా స్పందన రద్దు

స్పందన

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. మండలం, సచివాలయం స్థాయిలలో యథాతథంగా జరుగుతాయన్నారు.

న్యూస్‌రీల్

8న సీఎం పర్యటన

ఏర్పాట్ల పరిశీలన



పాట్టిలంకలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: వరద ప్రభావిత ప్రాంతాలైన పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లో ఈనెల 8వ తేదీ మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్నారు. దీనికి సంబంధించి గురజాపులంక వద్ద హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ ఏర్పాట్లను పి.గన్నవరం, ముమ్మిడివరం ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, పొన్నాడ సతీష్‌కుమార్ శనివారం పరిశీలించారు. అనంతరం పొట్టిలంక, కొండుకుదురులంకల్లో ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.

వసతి గృహ నిర్మాణానికి రూ.1.05 లక్షలు



ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవికి విరాళాన్ని అందజేస్తున్న దాత సత్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకుల వసతి గృహాల నిర్మాణానికి పట్టణానికి చెందిన శ్రీసూర్యకుమారి ఏజెన్సీస్ యజమాని లక్కింశెట్టి సత్యనారాయణ మూర్తి, సూర్యకుమారి దంపతులు రూ.1.05 లక్షల విరాళాన్ని సమకూర్చారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి దాతలు శనివారం అందజేశారు. పట్టణ వైశ్య సంఘం నాయకుడు యెండూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు దూనబోయిన బుజ్జి, ముంగర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన అప్పనపల్లి



అప్పనపల్లిలో శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లిలోని శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి తలనీలాలు, మొక్కుబడులు సమర్పించారు. ఉభయ దేవేరులతో కొలువు దీరిన శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.2.25 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.50 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.74,840 విరాళాలుగా వచ్చాయన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం వద్దిపర్రుకు చెందిన బస్వాని శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగవాసు సోదరులు రూ.10 వేలు, రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన మీసాల సుబ్బారావు, సావిత్రి దంపతులు రూ.10,116 స్వామివారి నిత్యాన్నదానానికి విరాళంగా చెల్లించారన్నారు. దాతలకు ట్రస్టు బోర్డు సభ్యులు కొమ్ముల సూరిబాబు, చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

శత్రువు ఒక్కడైనా ఎక్కువే.. స్నేహితులు వందమంది అయినా తక్కువే అంటారు వివేకానందుడు. మనిషిని అవసరంలో ఆదుకునే స్నేహ హస్తం కన్నా ప్రియమైనదేదీ లేదంటారు గురునానక్. నిజమైన మిత్రుడెవరో తెలిసేది కష్టకాలంలోనే అంటారు గాంధీజీ.. ఎవరేమన్నప్పటికీ స్నేహాన్ని మించింది ఈ లోకాన లేదంటారు సినీ కవులు.. **ఇంతటి** విశిష్ట బంధాన్ని పటిష్టం చేయ**దానికి ఇప్పటి** ఆధునిక కమ్యూనికేషన్ తోడ్పా**టునందిస్తోం**ది. చిన్నప్పుడెప్పుడో మరిచిపో**యిన** మిత్రుడ్ని గుర్తు చేస్తోంది. తన**తో చదు**వుకున్న వారందరినీ ఏకం చేస్తో**ంది.. సోషల్** మీడియా వేదికగా చాలామంది **స్నేహితుల**వుతున్నారు. పుట్టిన రోజు వస్తే **ఒకప్పుడు** ఇంట్లోవారికి తప్ప మరెవరికీ **తెలిసేది కాదు.** అలాంటిది ఇప్పుడు ఫేస్‌బుక్.. **వాట్సప్‌లు** వచ్చాక ఇలాంటి సందర్భాల్లో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికైనా సహాయం అందించడంలోనూ ఈ మిత్ర సమూహాలు ముందుంటున్నాయి. కొన్నాళ్లుగా టెన్త్‌లోనో.. లేదా మరే సందర్భంలోనో కలిసి చదువుకున్న వారంతా ఏటా ఒకసారైనా కలిసి ఆనందం కలబోసుకుంటున్నారు. వీరి స్నేహ కలయికకు ఆధునిక సమాచారమే వారధిగా నిలుస్తోంది.





నేస్తమా.. సేవా హస్తమా..

- సేవా దృక్పథాన్ని చాటుకుంటున్న మిత్ర సమూహాలు
- సోషల్ మీడియా వేదికగా ఒక్కటవుతున్న స్నేహితులు

ఆపదలో అండగా నిలిచి..

గోపాలపురం: ఇబ్బందుల్లో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981–82లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు. వీరంతా పెద్ద మనసుతో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో వీరితో చదువుకున్న సుమారు వంద మంది పూర్వ విద్యార్థుల ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్నారు. తోటి మిత్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. సుమారు రూ.2 లక్షల ఆర్థిక నిధి ద్వారా పేద విద్యార్థులకు జీవనోపాధిని కల్పిస్తున్నారు. విద్యార్థులకు సంబంధించి ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబానికి రూ. 25 వేల తక్షణ ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అట్టడుగు వర్గాల స్నేహితులకు వివిధ రంగాల్లో ఉపాధి కల్పిస్తున్నారు. ఇందుకు అవసరాన్ని బట్టి సాయం చేస్తున్నారు. తనతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించడం వల్ల సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని వైష్టవు శ్రీనివాసరావు చెప్పారు.



మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

స్నేహానికి సై

ప్రత్తిపాడు: వారు చిన్ననాటి స్నేహితులు. వారు వృత్తి రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. వారిలో ఒకరు తెలంగాణ గవర్నర్ తమిళిసై కాగా మరొకరు ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని దేవన్ రేమల. వారిద్దరూ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఒకే ప్రాంతంలో ఉండేవారు. తమ స్నేహం గురించి రేమల ఏమంటారంటే... ప్రస్తుతం గవర్నర్ తమిళిసై తండ్రి కుమారి అనంతన్, మా నాన్న దేవరాజ్ రాజకీయంగా సన్నిహితులు. **తమిళిసైతో కలిసి రాయపురంలో ఒకటో తరగతి నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకూ** చదువుకున్నాను. తమిళిసై మెడిసిన్ చదివారు. నేను ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాను. ఆమె గవర్నరుగా బాధ్యతలు చేపట్టారని తెలిసి చాలా సంతోషించాను. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ గవర్నర్‌కు మెయిల్ పంపాను. దీంతో ఆమె స్పందించారు. ఫలితంగా తమిళ సైను కలిసే అవకాశం ఇటీవల వచ్చింది. చూడగానే గవర్నర్ ఆప్యాయంగా పలకరించారు. ఆనాటి ముచ్చట్లను జ్ఞప్తికి తెచ్చుకున్నామని రేమల అన్నారు. అంతస్తులు, హోదాలు తమ స్నేహానికి అడ్డు కాలేదన్నారు.



చిన్ననాటి స్నేహితురాలైన తెలంగాణ గవర్నర్ తమిళసైని శాలువాతో సత్కరిస్తున్న ఉపాధ్యాయిని దేవన్ రేమల

ఔదార్యం... అ'పూర్వ'ం

మండపేట: ఆపన్నులకు ఆసరాగా నిలుస్తున్నారు మండపేట ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సేవా సంస్థ సభ్యులు. ఏటా రూ. 7.5 లక్షల నుంచి రూ. 8 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 75 మంది 2008లో ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ పేరిట సంస్థగా ఏర్పడ్డారు. కొంత స్థిర నిధిని ఏర్పాటు చేసుకున్నారు. కోవిడ్ ముందు వరకు 13 ఏళ్ల పాటు ఏటా ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు రూ. 2.5 లక్షల విలువైన పుస్తకాలు, స్టేషనరీని అందించేవారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ప్రభుత్వమే విద్యార్థులకు పుస్తకాలను అందిస్తుండటంతో మూడేళ్లుగా ప్రభుత్వ, మున్సిపల్ హైస్కూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. కలువపువ్వు సెంటర్‌లో ఏటా శ్రీరామ నవమి నుంచి జూన్ మొదటి వారం వరకు చల్లటి మజ్జిగను సరఫరా చేస్తున్నారు. ఇందుకు ఏటా రూ.4 లక్షలు వెచ్చిస్తున్నారు. సంస్థ కార్యదర్శి సంకా శ్రీనివాసరంగా ఏటా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి రూ. 1.5 లక్షల విలువైన బహుమతులు అందజేస్తున్నారు. ప్రస్తుతం బిక్కిన చక్రవర్తి అధ్యక్షునిగా ఉండగా కోశాధికారిగా పోతంశెట్టి సత్తిబాబు సేవలు అందిస్తున్నారు.



సైకియాట్రిస్ట్ డాక్టర్ రామారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న సభ్యులు (ఫైల్)

వారిది 'వజ్ర' సంకల్పం



డైమండ్ గ్రూప్ సభ్యులు

తాళ్లరేవు: తాళ్లరేవు శ్రీమతి నామన వెంకాయమ్మ జెడ్పీ హైస్కూల్‌లో 1987–88లో చదివిన టెన్త్ విద్యార్థులు డైమండ్ గ్రూప్‌గా ఏర్పడి పలు సేవలందిస్తున్నారు. తమతో చదువుకుని ఆర్థికంగా వెనుకబడిన సహచరులకు చేయూత అందిస్తున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో రూ.1.35 లక్షలతో స్టేజ్ నిర్మించారు. ఒక మిత్రుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో రూ.1.25 లక్షల ఆర్థిక సాయమందించారు. మరో మిత్రుడు సత్యానందం కుమార్తెల పేరున రూ.లక్ష డిపాజిట్ చేశారు. మిత్రుడు విజయ్ కుమార్ ఇంటి నిర్మాణానికి రూ.76 వేలు అందించారు. అనారోగ్యంలో ఉన్న వెంటపల్లి నూకరాజుకు రూ.50 వేలు.. ఇలా తోటి స్నేహితులకు ఏ కష్టం వచ్చినా మేమున్నామంటూ శ్రీనివాసరెడ్డి, గంజా సూరిబాబు, పొన్నాడ పేరయ్య రాజు తదితరులు బాసటగా నిలుస్తూ స్నేహ బంధాన్ని చాటుకుంటున్నారు.

గోకులనందన గోవిందా..



ఆలయం వద్ద భక్తుల కోలాహలం

ఆత్రేయపురం: గోవిందా.. హరి గోవిందా.. గోకుల నందన గోవిందా అంటూ ఆ శ్రీనివాసుడిని భక్తజనం మనసారా స్మరించింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారిని సుమారు 45 వేల మంది దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజాదికాలను అర్చకులు నిర్వహించారు. అలాగే స్వామివారికి వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన జరిగింది. ఈ ఒక్కరోజే స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ విక్రయాల, విరాళాల ద్వారా రూ.32,28,714 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయం వద్ద ట్రాఫిక్ పెరగడంతో ఎస్సై కిరణ్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

చంద్రబాబుకు మతిభ్రమించింది

- వుంగనూరులో అలజడికి అతనే కారణం
- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



అమలాపురం టౌన్: అధికారం కోల్పోయి నిరాశ, నిస్పృహలతో ఉన్న చంద్రబాబుకు మతి భ్రమించిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ విమర్శించారు. చిత్తూరు జిల్లా వుంగనూరులో టీడీపీ శ్రేణులతో అలజడికి ఆజ్యం పోశాడని అన్నారు. శనివారం అమలాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు టూర్‌పై పోలీసులకు ఇచ్చిన రోడ్డు మ్యాప్‌లో వుంగనూరు లేకపోయినప్పటికీ అటువైపు టీడీపీ గూండాలతో వెళ్లి పోలీసులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు దిగడం హేయమైన చర్యని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు చేయని దాడులను చేసినట్లుగా చెబుతూ పథకం ప్రకారం సాగించిన రాక్షస క్రీడను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. చిత్తూరు జిల్లా అభివృద్ధి ప్రదాత మంత్రి రామచంద్రారెడ్డి, శాంతి భద్రతలు కాపాడుతున్న ఆ జిల్లా ఎస్పీలపై చంద్రబాబు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. చంద్రబాబు గొడవలను స్వయంగా సృష్టించి తద్వారా సానుభూతి పొందేందుకు పక్కా స్కెచ్‌తోనే వుంగనూరు వచ్చాడని ఇజ్రాయిల్ అన్నారు. అబద్ధాలను సునాయాసంగా చెప్పడం టీడీపీ నాయకులకు, చంద్రబాబుకు అలవాటైపోయిందన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్య భవనాలపై దృష్టి సారించండి

కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం

అమలాపురం రూరల్: ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాలు, ఇళ్ల స్థలాల కేటాయింపు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష రీసర్వే, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలు, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాల పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డీఆర్‌ఓలతో సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనంతరం అమలాపురంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాల లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో సాగాలని, లేఅవుట్లలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. భూరక్ష సర్వేను నిర్దేశిత కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు బాటలు వేయాలని సూచించారు. నవంబర్ 1న రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా అవార్డుల ప్రదానం చేస్తామన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలను గుర్తించేందుకు రాష్ట్ర స్థాయిలో హైపవర్ స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారని, వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనపరిచిన వారికి పురస్కారాల్లో ప్రాధాన్యం కల్పిస్తారన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న వైఎస్సార్ జీవితకాల సాఫల్య పురస్కారాల కోసం వివిధ రంగాలు, విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ శుక్లా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

స్వాతంత్య్ర దినోత్సవానికి పక్కా ఏర్పాట్లు

అమలాపురం రూరల్: స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో జిల్లా సాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పతాకావిష్కరణ, పోలీసుల కవాతు తదితర ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలన్నారు. ముఖ్య అతిథులు, స్వాతంత్య్ర సమరయోధులు, పాత్రికేయుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక, విపత్తుల స్పందన విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించిన అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆయా శాఖల శకటాల ప్రదర్శనలను ఏర్పాటు చేయాలన్నారు. నా మట్టి –నా దేశం పేరిట ఐదు రకాల కార్యక్రమాలు ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఈ నెల 16 నుంచి పట్టణ ప్రాంతాల్లో చేపట్టాలని అన్నారు.

నేడు మంత్రులు అంబటి, కొట్టు రాక

రాజానగరం: నియోజకవర్గంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో ఆదివారం జరిగే వివిధ కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, కొట్టు సత్యనారాయణ పాల్గొంటారు. దివాన్‌చెరువు జంక్షన్‌లో ఉదయం 11 గంటలకు జరిగే దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు జయంతికి మంత్రి రాంబాబు హాజరవుతారు. దివాన్‌చెరువు నుంచి శ్రీకృష్ణపట్నం మీదుగా పుణ్యక్షేత్రం వరకు జరిగే బైక్ ర్యాలీలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పుణ్యక్షేత్రంలో జక్కంపూడి రామ్మోహనరావు, వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఆవిష్కరిస్తారు. రామ్మోహనరావు జయంతిని పురస్కరించుకుని సీతానగరం మండలం ఇనుగంటివారిపేట పంచాయతీ వద్ద ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా వెయ్యి మంది మహిళలకు చీరలను పంపిణీ చేస్తారు. సాయంత్రం 5 గంటలకు సీతానగరం జీవీకే కన్వెన్షన్ హాలులో నిర్వహించే మెగా జాబ్‌మేళాను మంత్రి సందర్శిస్తారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: క్రీడా ప్రాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులకు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని శనివారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విశిష్ట ప్రతిభ కనబరిచిన వ్యక్తులు తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక పేజీకి మించకుండా అచీవ్‌మెంట్ వివరాలు, చిరునామా, ఫోన్ నంబర్, ఇ–మెయిల్ వివరాలు, ప్రతిభకు సంబంధించిన పత్రాలు జతచేసి సదరు దరఖాస్తును రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఇ–మెయిల్‌కు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పంపాలన్నారు. నేరుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జీఎంసీ బాలయోగి స్టేడియం, అమలాపురం కార్యాలయంలో అందజేయవచ్చన్నారు. ఇతర వివరాలకు 79933 29433 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

చేపల చెరువులుగా మార్చిన అర్చక సేవా భూములు స్వాధీనం

కోర్టు ఆదేశాలతో ఆలయ ఈఓకు అప్పగింత

కపిలేశ్వరపురం: వల్లూరులో అర్చకుల స్వాధీనంలో ఉన్న దేవదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన 6.44 ఎకరాల సాగు భూములను నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులుగా తవ్విన విషయంలో సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. కోర్టు, దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అర్చకుల నుంచి భూములను స్వాధీనం చేసుకున్నారు. ఆ భూములను శనివారం జిల్లా దేవదాయ శాఖ అధికారి కేఎస్‌వీడీవీ ప్రసాద్ సమక్షంలో వల్లూరులో ఆలయ ఈఓ పెదపూడి వీరవెంకట సత్యనారాయణ మూర్తికి అప్పగించారు. ఆ వివరాల ప్రకారం..


భూముల స్వాధీన పత్రాలను అందుకుంటున్న ఈఓ సత్యనారాయణమూర్తి

వల్లూరులోని శ్రీఅగస్త్యేశ్వర, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో సేవ చేస్తున్న అర్చకుల స్వాధీనంలో 6.44 ఎకరాల దేవదాయ భూమి ఉంది. ఆ భూములున్న ప్రదేశంలో గ్రామానికి చెందిన, ఓ రాజకీయ నాయకుడి ప్రోద్బలంతో చేపల చెరువులతో ఆక్వా సాగు జరుగుతుంది. అర్చక సేవా సర్వీసు భూములను సైతం లీజుకు తీసుకుని చేపల చెరువులుగా మార్చేశారు. దీనిపై ఆలయ ఈఓ పెదపూడి వీరవెంకట సత్యనారాయణమూర్తి అంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2022 జనవరి 21న తొమ్మిది మంది ఆలయ అర్చకులపై అంగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దేవదాయ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దురుద్దేశంతో అక్రమ లాభం కోసం వాటిని చెరువులుగా తవ్వేశారంటూ ఈఓ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వివాదం కోర్టు వరకూ వెళ్లింది. కోర్టు ఆదేశాలపై దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ సూచనలతో అర్చకుల భూములను స్వాధీనం చేసుకుని ఈఓకు అప్పగించారు. కార్యక్రమంలో రామచంద్రపురం తనిఖీదారు ఆర్.బాలాజీ రామ్‌ప్రసాద్, వీఆర్వో శ్రీనివాస్, దేవదాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి విరాళం

రూ.10 లక్షలు అందజేసిన దాత

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రానికి రూ.10,10,116 విరాళాన్ని పెనుమంత్ర మండలం ఆలమూరు గ్రామానికి చెందిన ఇందుకూరి బాల బంగార్రాజు, స్వాతి దంపతులు అందజేశారు. శనివారం వాడపల్లి వెంకన్న సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజులకు ఈ విరాళాన్ని సమర్పించారు. ఇటీవల వెంకన్న సన్నిధిలో సుమారు రూ.5.50 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తాము కోరిన కోర్కెలు నెరవేరడంతో ఈ విరాళాన్ని అందించినట్లు ఇందుకూరి బాల బంగార్రాజు, స్వాతి తెలిపారు. పదేళ్ల నుంచి ఆలయానికి వస్తుండడంతో రూ.10 లక్షలు విరాళం అందించామని అన్నారు. దాత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.


దాత దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మేడపాటి ధర్మారెడ్డి తదితరులు

కాకినాడ లీగల్: దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలని అలిండియా లాయర్ యూనియన్ (ఐలు) రాష్ట్ర నాయకుడు డి.రాజగోపాల్ డిమాండ్ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 'ఐలు' ఆధ్వర్యంలో ఆరో మహాసభ కాకినాడ బార్ అసోసియేషన్ హాల్లో శనివారం నిర్వహించారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేడపాటి ధర్మారెడ్డి అధ్యక్షత వహించగా రాజగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐలు చేసిన కార్యక్రమాల నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరాచార్యులు ప్రవేశపెట్టగా సభ్యులంతా ఆమోదించారు. అనంతరం ఐలు 2023–25 జిల్లా, నగర కమిటీల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మేడపాటి ధర్మారెడ్డి (కాకినాడ), ప్రధాన కార్యదర్శిగా జి.భాస్కరాచార్యులు (పిఠాపురం), ఉపాధ్యక్షులుగా ఇక్బాల్ (అమలాపురం), ఆర్వీ రమణారావు (పిఠాపురం), కార్యదర్శులుగా కేఆర్‌కే రాజు (ముమ్మిడివరం), టీవీవీ రమణమూర్తి (అనపర్తి), జాయింట్ సెక్రటరీగా సుదిన శ్రీనివాస్ (కాకినాడ), కోశాధికారిగా వెంకటరెడ్డి బహదూర్ షా (కాకినాడ)తో పాటు 26 మంది సభ్యులతో నూతన ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నికైంది. నగర కమిటీ అధ్యక్షుడిగా పి.రామచంద్రరాజు, కార్యదర్శిగా కె.నాగజ్యోతి, వైస్ ప్రెసిడెంట్‌గా ఉమామహేశ్వరావు, ట్రెజరర్‌గా టి.రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీగా దేశీతో పాటు 12 మంది ఎన్నికయ్యారు.